





# ఓ మంచు నగరం వెలిసింది!







అదో అందమైన మంచు నగరం. అచ్చెరువొందించే కోటలు, ముచ్చట గొలిపే సౌధాలు, చూడచక్కని క్రీడా ప్రాంగణాలు... అన్నీ హిమశిలలతోనే నిర్మించి ఉంటాయక్కడ. రంగురంగుల విద్యుద్దీపాలే వాటి గోడలకు వెల్ల వేస్తాయి. కాంతులు విరజిమ్మే అక్కడి వీధుల గుండా గుర్రపు బగ్గీలు, ట్రామ్‌లు తిరుగుతుంటాయి. వాటిలో ఒకరూ ఇద్దరూ కాదు, లక్షల జనం పచార్లు చేస్తుంటారు. వాళ్లంతా ఆ ఊరి వాళ్లేం కాదు. ఏడాదికోసారి ప్రత్యక్షమయ్యే ఈ వింతను చూసి పోయే ఔత్సాహికులు. చైనా దేశంలోని హార్బిన్ నగరంలో ఏటా జరిగే 'ఐస్ అండ్ స్నో ఫెస్టివల్' సంగతులివి. అందులోనూ ఈ ఏడాది చరిత్రలోనే అతి పెద్దది. మెరుపులా వెలిసి.. చినుకులా కరిగిపోయే ఈ మంచు మహా నగరాన్ని చూసేందుకు మళ్లీ వేళయ్యింది.

మంచు కురవడం, దాన్ని చూడటం అంటే చాలా మందికి సరదా. తెల్లని మంచులో ఆటలాడటంలో మజానే వేరు అంటారు వీళ్లు. అందుకే అలాంటి ప్రదేశాల్లో స్నో ఫెస్టివల్స్ పుట్టుకొస్తుంటాయి. చైనాలోని  హేలాంగ్ జియాంగ్ ప్రావిన్సులో ఉండే హార్బిన్ నగరమూ ఆ కోవలోదే. అక్కడ చలికాలంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోతాయి. దాంతో నాలుగైదు నెలలపాటు ఆ ఊళ్లో ప్రవహించే సాంఘువా నది గడ్డకడుతుంది. అందులోంచి పెద్ద పెద్ద మంచు ముక్కలను తెచ్చి నగరమంతా చూడచక్కని భవంతులు నిర్మిస్తారు అక్కడివాళ్లు. అందమైన శిల్పాలు, ఆటాడుకునేలా జారుడు బల్లల్లాంటి నిర్మాణాలు కూడా మంచుగడ్డలతోనే ఏర్పాటుచేస్తారు. వీటన్నిటికీ విద్యుద్దీపాలను అమర్చి శోభాయమానంగా కనిపించేలా చేస్తారు. 41వ హార్బిన్ ఐస్ అండ్ స్నో ఫెస్టివల్ ఈ ఏడాది జనవరి 5న ప్రారంభమైంది. ఫిబ్రవరి చివరివారం వరకూ కొనసాగుతుంది. ఈ మంచు పండుగ చూడటానికి తొలి రోజు ఎనిమిది లక్షల మంది పర్యటకులు రాగా, గతేడాది మొత్తంగా సుమారు 18 కోట్ల మంది ఈ ప్రాంతాన్ని సందర్శించారట.



**అతిపెద్దది**

ప్రపంచంలోనే అతిపెద్ద మంచు పండుగగా హార్బిన్ ఫెస్టివల్‌కి పేరుండగా, ఈసారి జరిగేది చరిత్రలోనే అతి పెద్దదట. మూడు లక్షల క్యూబిక్ మీటర్ల మంచును ఉపయోగించి సుమారు 247 ఎకరాల్లో ఈ మంచు కళాఖండాలను ఏర్పాటుచేశారు. ఇక్కడ భవంతుల్లాంటి నిర్మాణాలతోపాటు ప్రపంచంలో పేరెన్నికగన్న.. తాజ్‌మహల్, బుర్జ్ ఖలీఫా, రోమ్ కొలోజియంలాంటి ప్రఖ్యాత నిర్మాణాలెన్నో దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. ఇదంతా ఏదో ఉష్ణోగ్రతను నియంత్రించే ప్రత్యేక నిర్మాణం లోపల ఉంటుందనుకుంటే మనం పొరబడ్డట్టే. సాధారణంగా ఇళ్లు ఎలా ఉంటాయో అచ్చం అలాగే నేరుగా బయటే ఈ మంచు ఆకృతుల్ని ఏర్పాటుచేస్తారు. కాకపోతే, అక్కడి తీవ్రమైన శీతల ఉష్ణోగ్రతల కారణంగా ఇవి కరిగిపోవన్న మాట. ఎంత వింత మంచు పండుగో... అనిపిస్తుంది కదూ ఇదంతా చూస్తుంటే!

**హార్బిన్ ఐస్ అండ్ స్నో ఫెస్టివల్**
**300,000 క్యూబిక్ మీటర్ల ఐస్ అండ్ స్నో... క్యాసిల్స్, స్లైడ్స్, స్కల్పచర్స్.**

